## క్లుప్తంగా

### పీహెచ్‌సీ వైద్యుల నిరసనకు సంఘీభావం



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

**బ్రహ్మసముద్రం:** తమ సమస్యలు పరిష్కరించాలంటూ గత కొన్ని రోజులుగా పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన నిరసన కార్యక్రమాలకు మండల వైద్య సిబ్బంది మంగళవారం సంఘీభావం తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అబ్బాస్, హెల్త్ ఆఫీసర్ రాణీఎస్తేర్, సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ, ఫార్మాసిస్ట్ మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### డివైడర్‌ను ఢీకొన్న ఆటో

- నలుగురు విద్యార్థినులకు గాయాలు

**రాయదుర్గం టౌన్:** స్థానిక డిగ్రీ కళాశాల వద్ద వైఎస్సార్ సర్కిల్‌లోని డివైడర్‌ను ప్యాసింజర్ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు డిగ్రీ విద్యార్థినులు గాయపడ్డారు. మంగళవారం పట్టణం నుంచి కేటీఎస్ డిగ్రీ కళాశాలకు నలుగురు విద్యార్థినులు ఆటలో బయలుదురారు. కళాశాల సమీపంలోనే ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడిని తప్పించబోయి అక్కడే ఉన్న డివైడర్ దిమ్మెను డ్రైవర్ ఢీకొన్నాడు. ప్రమాదంలో డ్రైవర్ దుర్గేష్‌కు రక్తగాయాలయ్యాయి. డిగ్రీ విద్యార్థినులు గఘన, అంబికా, అశ్విని, సాఖిబ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇళ్లకు చేరుకున్నారు. డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

### పరామర్శ



జయరామిరెడ్డిని పరామర్శిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

**కణేకల్లు:** గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని అనంతపురంలో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉషారాణి భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోకుర్తి జయరామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. డాక్టర్లు సూచించిన సలహాలను పాటించి త్వరగా కోలుకోవాలన్నారు.


### గుర్తు తెలియని వాహనం ఢీ



గాయపడిన మతిస్థిమితం లేని మహిళ

**కళ్యాణదుర్గం:** గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో మతిస్థిమితం లేని మహిళకు గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం కళ్యాణదుర్గం మండల పరిధిలోని శీబావి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మతిస్థిమితం లేని మహిళ రోడ్డు పక్కన వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గాయాలతో పడిన మహిళను గమనించిన స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేసి కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాల కోసం ప్రయత్నించగా ఆమె మాట్లాడటం లేదు. సంబంధీకుల కోసం ఆరా తీస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### పారదర్శకంగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ రవిశంకర్ రెడ్డి

**రాయదుర్గం టౌన్:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏమాత్రం తప్పులు లేని, పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించాలని ఈఆర్‌ఓ రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఓటర్ల జాబితా తయారీ, లోటుపాట్లు, చేర్పులు, మార్పులు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, అర్బన్ ఏరియాలో డోర్ నంబర్ల మార్పు చేయుట, ఇతరాత్ర విషయాలపై సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదులో క్షేత్రస్థాయిలో సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. సమావేశంలో ఈడీటీ సుజాత, డీటీ రఘు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బషీర్ అహ్మద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున, ఆప్ పార్టీ జిల్లా కన్వీనర్ వెంకట రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

## 'మొక్క'బడిగా విధులు



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చెట్టు కింద పడేసిన మొక్కలు

**కళ్యాణదుర్గం:** స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇటీవల మండల పరిషత్ అధికారులు కార్యాలయ ఆవరణలో నాటేందుకు వివిధ రకాల మొక్కలను ఫారెస్ట్ నర్సరీల నుంచి తీసుకొచ్చారు. అయితే మొక్కుబడిగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయం ముందు భాగంలో కొన్ని మొక్కలు నాటి చేతులు దులుపుకున్నారు. మిగిలిన మొక్కల్ని ఇలా చెట్ల కింద పడేశారు. వివిధ రకాల మొక్కలు నీరు లేక పూర్తిగా ఎండిపోయాయి. నర్సరీల్లో ఉన్నా మొక్కలు ఎండిపోయేవి కాదని పలువురు వాపోతున్నారు. మొక్కలు నాటనప్పుడు నర్సరీల నుంచి ఎందుకు తీసుకు రావాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## విస్తరించిన సేవలు ప్రారంభం



ఖాతాదారులతో కిటకిటలాడుతున్న గ్రామీణ బ్యాంక్

**కళ్యాణదుర్గం:** గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియలో భాగంగా ఈనెల 10వ తేదీ నుండి 13వ తేదీ వరకు బ్యాంక్ సేవలను తాత్కాలికంగా ఆపేసిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం నుంచి ఆర్థిక లావాదేవీలు నగదు చెల్లింపు, డిపాజిట్ సేవలు ప్రారంభమయ్యాయి. సర్వర్ సమస్య, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కావడంతో ప్రజలు కొంత మేరకు ఇబ్బందులు పడ్డారు. ఫోన్‌పే, పేటీఎం, నెట్‌బ్యాంకింగ్ తదితర ఆన్‌లైన్ సేవలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని బ్యాంక్ మేనేజర్ కళ్యాణ్ కుమార్ తెలిపారు. ఇందుకు ఖాతాదారులు సహకరించాలని సూచించారు.

## రోడ్లపై మురుగు.. ప్రజల బేజారు



ఉదిరిపికొండలోని స్కూల్ ముందు ప్రవహిస్తున్న మురుగు

**కూడేరు:** మండల పరిధిలోని ఉదిరిపికొండ గ్రామంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఈ రోడ్లపై పాదచారులు నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. మరోపక్క మురుగులో దోమలు వృద్ధి చెంది దోమకాటుకు రోగాల బారిన పడుతున్నారు. ప్రధాన రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడం, కొళాయిలకు సక్రమంగా బిరడాలు లేకపోవడంతో నీరు వృథాగా రోడ్లపై పారుతోంది. స్థానికులు వంట పాత్రలు శుభ్రం చేసిన నీరు, బట్టలు ఉతికిన నీరు రోడ్డుపై పారబోయడంతో బురదమయం అవుతున్నాయి. ప్రాథమికోన్నత పాఠశాల ముందు రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలువురు విద్యార్థులు మురుగులో పడి గాయాలపాలైన సందర్భాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై అపరిశుభ్రత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# వైఎస్సార్‌సీపీ శ్రేణులకు డిజిటల్ బుక్ అండ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

**బొమ్మనహాళ్:** కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ అరాచక పాలన సాగిస్తున్నారని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫొటో బసవరాజు స్వగృహంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులకు అండగా ఉండేందుకు డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని చెప్పారు. అరాచకాలకు పాల్పడే కూటమి పార్టీ నాయకులు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నోట బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారంటీ అనే మాట వినిపించేదని.. ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోందన్నారు. సూపర్ సిక్స్ ..సూపర్ సెవన్ అంటూ మేనిఫెస్టోలో 143 హామీలిచ్చారని.. ప్రస్తుతం వాటిని గాలికొదిలేశారన్నారు. దేశ చరిత్రలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తెచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో చంద్రబాబు రూ.కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ పరం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు రామాంజనేయులు, రవీంద్రనాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు పయ్యావుల సత్యన్న, ఫొటో బసవరాజు, కోటేశ్వరరెడ్డి, వెంకటేశులు, అంజనేయులు, విశ్వనాథ్ రెడ్డి, డాక్టర్ బసప్ప, ఉద్దేహాళ్ వన్నూరు స్వామి, లక్ష్మీనారాయణ, జి.ఎం.నాయుడు, ప్రభాకర్‌గౌడ్, రామ్ చరణ్, ముత్తన్న, అంజిరెడ్డి, నాగరాజు, సురేష్, బుజ్జన్న, కోరి వీరేష్, దాసరి సూరి, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల్లో ఆత్మవిశ్వాసం నింపాలి



మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ అధికారులు

**రాయదుర్గం టౌన్:** బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు, సమాజం వారిని చైతన్యవంతుల్ని చేసి ప్రోత్సాహించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్, ఆరోగ్య విద్యాబోధకుడు లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక 18వ వార్డులో మంగళవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బాలికల ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత, విద్యా, సమానత్వం, భద్రత తదితర అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు విద్యావంతులు అయితే మొత్తం కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. బాలికలకు విద్య అందించడం అంటే భవిష్యత్తు తరాలను బలపరచడం అవుతుందన్నారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ ఎర్రిస్వామి, సూర్యనారాయణ, హెల్త్ సెక్రటరీలు నాగమణి, లలిత, వనజాక్షి, అంగన్‌వాడీ వర్కర్ సరిత, ఆశా కార్యకర్తలు ఉమ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

**వజ్రకరూరు:** బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సర్పంచ్ మల్లెల జగదీష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని చాబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రహంతుల్లా, హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆరోగ్య కార్యకర్త వరలక్ష్మి, మహిళా పోలీస్ అరుణ, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యను దూరం చేసేందుకు కుట్ర



ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**కణేకల్లు:** చంద్రబాబు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. లేకపోతే చరిత్రహీనుడిగా మిగిలిపోతారని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మనందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో మంగళవారం 'రచ్చబండ' కార్యక్రమం నిర్వహించారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబుకు పేదలు అంటే పడదన్నారు. పేద పిల్లలకు వైద్య విద్య అందకుండా చేయాలనే ఉద్దేశంతో కూటమి సర్కారు మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంతో ఇతరులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. నిరుపేద పిల్లలకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారడం తథ్యమన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన పోరులో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, సర్పంచు కురుబ వన్నప్ప, మాజీ సర్పంచు కురుబ లోకేష్‌గౌడ్, మాజీ కో–ఆప్షన్ మెంబర్ కురుబ మల్లికార్జున, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ యండ్రకాయల వన్నూరప్ప, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి హళ్లి నాగరాజు, వేమన, పార్టీ మండల యూత్ విభాగం అధ్యక్షుడు కురుబ తేజ, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, క్రిష్టారెడ్డి, బాషా, కురుబ కిశోర్‌గౌడ్, బెణికల్లు ఎంపీటీసీ శరబన్న, మాజీ సర్పంచు జేజేటీ ప్రభాకర్‌రెడ్డి, బోయ సంగప్ప, భీమిరెడ్డి, కె.హనుమంతప్ప, చెన్నయ్య, లక్ష్మీనారాయణ, లాలుసాబ్

### అభివృద్ధి పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మారుతమ్మ

**కళ్యాణదుర్గం:** గ్రామాల అభివృద్ధికి అందరం పాటుపడదామని ఎంపీపీ మారుతమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండేలా చొరవ చూపాలన్నారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమన్వయపరుచుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. అనంతరం వివిధ శాఖల అభివృద్ధి, పురోగతిపై అధికారులు వివరించారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకానికి సంబంధించి జాబ్ కార్డుల ఈ–కేవైసీ కూలీలు తప్పక చేయించుకునేలా చొరవ చూపాలని ఎంపీడీఓ ధనుంజయనాథ్ సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ లక్ష్మీకాంతమ్మ, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ లక్ష్మీదేవితో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న బీఎం నాగసుబ్రహ్మణ్యం

**బెళుగుప్ప:** బ్యాంకు ఖాతాదారులు ఆన్‌లైన్ సైబర్ క్రైమ్‌లపై అప్రమత్తంగా ఉండాలని బెళుగుప్ప ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ నాగసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బ్రాంచ్‌లో ఖాతాదారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించి బ్యాంకు సేవలపై ఖాతాదారులతో సమీక్ష చేపట్టారు. ఖాతాదారులకు మరింత ఉత్తమ సేవలను అందించడమే బ్యాంకు లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు పంట రుణాలను ఎకరానికి రూ.50 వేల వరకు అందిస్తున్నామని పేర్కొన్నారు. డిపాజిట్లకు 7.2 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ క్యాషియర్ ఎర్రిస్వామి, ఎస్‌డబ్ల్యూఓ సురేష్, ఇన్‌చార్జ్ ఆఫీసర్ ఆదినారాయణ, సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### రైతులు, కార్మిక సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న కేశవ రెడ్డి

**కూడేరు:** రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అండగా నిలుస్తామని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కూడేరులో తాలుకా స్థాయి వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం సీపీఐ మండల కార్యదర్శి నాగేంద్ర అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక కార్యకర్త, నేత కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యకాసం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నారాయణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి శివ, నియోజక వర్గ అధ్యక్షుడు మలరాయుడు, కార్యదర్శి చెనరాయుడు, మండల అధ్యక్షుడు రమణ, నేతలు వెంకటేష్, చిన్నభీమన్న, ధనరాజ్, ఎస్.వెంకటేష్, ముత్యాలన్న, వన్నూరమ్మ, వనజమ్మ పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



**కణేకల్లు:** రాష్ట్రస్థాయి అండర్–19 ఖోఖో పోటీలకు కణేకల్లు మోడల్ స్కూల్‌కు చెందిన కె.స్వప్న, కె.సోనిక, ఎస్.దానేశ్వరి ఎంపికయ్యారు. అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజీలో ఈనెల 13న జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థినులు సత్తా చాటడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెహానా బేగం, పీడీ రమేష్ తెలిపారు. త్వరలో విజయనగరం జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటారని వెల్లడించారు.

## సంక్షిప్త సమాచారం

### దేవస్థానాల పునరుద్ధరణకు చర్యలు

**బొమ్మనహాళ్:** మండలంలో శిథిలావస్థకు చేరిన దేవస్థానాల పునరుద్ధరణకు దేవాదాయశాఖ దృష్టి సారించిందని దేవాదాయశాఖ ఇన్‌చార్జ్ ఈఓ బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని దేవాదాయశాఖ అసిస్టెంట్ స్థపతి సుబ్రహ్మణ్యం, ఇంజినీర్లు మహేంద్ర, యశ్వంత్, కణేకల్లు ఈఓ దేవదాస్ పరిశీలించారు. దేవాలయాల పునరుద్ధరణకు దశల వారీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గోపురాలు, మండపాలు, ప్రాకారాలు వంటి నిర్మాణాల మరమ్మతులతో పాటు భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవాదాయ సిబ్బంది ఆనంద్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.


### తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

**కళ్యాణదుర్గం:** కంబదూరు తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న రెవెన్యూ, భూ సమస్యలపై తహసీల్దార్ బాలకిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మండలంలో సోలార్ ఏర్పాటు చేయనున్న గ్రామాలపై ఆరా తీశారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకుని నివేదికలు తయారు చేయాలని సూచించారు.

### భోజనశాల ఏర్పాటుకు భూమిపూజ

**వజ్రకరూరు:** మండల పరిధిలోని గంజికుంట గ్రామంలో మంగళవారం శివాలయం, పెద్దమ్మ దేవాలయాల వద్ద భోజనశాల (అన్నదాన సత్రం) నిర్మాణానికి సర్పంచ్ జయేంద్రరెడ్డి భూమిపూజ చేశారు. భోజనశాల నిర్మాణానికి రూ.4 లక్షల సొంత నిధులు వెచ్చిస్తున్నట్లు సర్పంచ్ వెల్లడించారు.

### డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసులు



శ్రీనివాసులును అభినందిస్తున్న అధ్యాపకులు

**రాయదుర్గం టౌన్:** స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా ఎస్.శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పని చేస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మెడికల్ లీవ్‌పై వెళ్లారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శ్రీనివాసులు ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు ప్రిన్సిపాల్‌ను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

### 17న మండల సర్వసభ్య సమావేశం

**ఉరవకొండ:** ఉరవకొండ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, పశుసంవర్ధక శాఖ తదితర శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

### ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం



మందులు అందిస్తున్న పశువైద్య సిబ్బంది

**కుందుర్పి:** మండలంలోని నిజవళ్లి గ్రామంలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. పంచాయతీలోని 220 పశువులకు ఉచితంగా వైద్య చికిత్సలు చేశారు. గర్భకోశ వ్యాధి నివారణకు మందులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి వెంకటేశ్ ఏడీ నాగలింగేశ్వ రెడ్డి శింగనమల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు పద్మనాభం, స్థానిక డాక్టర్ ప్రసాద్, సర్పంచ్ ప్రభాకర్ రైతులు పాల్గొన్నారు.

### గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**రాయదుర్గం టౌన్:** స్థానిక కణేకల్లు రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విభాగంలో ఖాళీగా ఉన్న ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఎస్సీ బయోకెమిస్ట్రీ, ఎంఎస్సీ మైక్రో బయాలజీ లేదా ఎంబీబీఎస్ విద్యార్హత ఉన్న వారు 16వ తేదీ గురువారం సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### జువాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టు ఖాళీ..

**కణేకల్లు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జువాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు నిరుద్యోగులైన యువకులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఎంఎస్సీ జువాలజీ చేసిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వెల్లడించారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను కాలేజీలో సమర్పించాలన్నారు. అదనపు సమాచారం కోసం 7780405121, 9949237426 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.


### సన్మానం



గౌని ఉపేంద్రరెడ్డిని సన్మానిస్తున్న రిటైర్డ్ పెన్షనర్లు

**రాయదుర్గం టౌన్:** ఇటీవల వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ సభ్యుడిగా ఎంపికైన గౌని ఉపేంద్రరెడ్డిని ఏపీ స్టేట్ పెన్షనర్ల సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. మంగళవారం గౌని ఉపేంద్రరెడ్డిని ఆయన స్వగృహంలో పెన్షనర్లు కలిసి పూలమాల, శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పెన్షనర్లు రామన్న, రాజగోపాల్ రెడ్డి, హనుమంత రెడ్డి, కేశవరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రస్తా సమస్యకు పరిష్కారం



కనుకూరులో రస్తా సమస్యపై వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ

**శెట్టూరు:** మండలంలోని కనుకూరు గ్రామంలో చాలా సంవత్సరాలుగా ఉన్న రస్తా సమస్యను తహసీల్దార్ ఈశ్వరమ్మ పరిష్కరించారు. సంబంధిత గ్రామంలో సర్వే నంబర్ 995, 999లో రస్తా లేక చాలా ఏళ్లుగా రైతులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ మంగళవారం క్షేత్రస్థాయిలో రస్తాను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి రస్తా వదిలేందుకు రైతులను ఒప్పించి సమస్యకు పరిష్కారం చూపారు. మండలంలో పలు చోట్ల రైతుల పొలాలకు రస్తా సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి రైతులు కలిసి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ గౌతమ్, సర్వేయర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

### సత్యసాయి పైపులైన్‌కు లీకేజీ

- రెండు రోజులుగా నీటి సరఫరా బంద్

**వజ్రకరూరు:** మండల పరిధిలోని రాగులపాడు గ్రామ పరిసర ప్రాంతంలో సత్యసాయి పైపులైన్ పగిలింది. దీంతో రాగులపాడు, కడమలకుంట గ్రామాలకు రెండు రోజులుగా సత్యసాయి మంచి నీరు సరఫరా ఆగిపోయింది. మంగళవారం సత్యసాయి వాటర్‌సప్లయ్ సిబ్బంది అక్కడకు చేరుకుని పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. బుధవారం నుంచి గ్రామాలకు నీరు సరఫరా చేస్తామని సిబ్బంది తెలిపారు.


### పోటాపోటీగా వరిధాన్యం వేలం పాట



సూచనలిస్తున్న ఏడీఏ నారాయణ నాయక్

**కణేకల్లు:** కణేకల్లులోని వ్యవసాయ విత్తనోత్పత్తిక్షేత్రంలో మంగళవారం జరిగిన వరిధాన్యం వేలం పాట పోటాపోటీగా సాగింది. అగ్రికల్చర్ ఫారంలో రబీ సీజనల్‌లో ఆర్‌ఎన్‌ఆర్–15048 రకం విత్తన వరి సాగు చేయగా.. 145 క్వింటాళ్ల ధాన్యం తడిచి రంగుమారి విత్తన వరికి రిజక్షన్ అయ్యింది. దీంతో 145 క్వింటాళ్ల వరిధాన్యానికి ఏడీఏ నారాయణ నాయక్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలం పాటలో పాల్గొన్న వ్యాపారులు వరిధాన్యం దక్కించుకునేందుకు పోటీపడ్డారు. చివరికి అనంతపురానికి చెందిన సత్యనారాయణ అనే వ్యాపారి క్వింటా వరిని రూ.1,550లతో దక్కించుకున్నాడు. వారం లోపు వరిధాన్యం సొమ్ము చెల్లించి ధాన్యాన్ని తీసుకెళ్లాలని ఏడీఏ సూచించారు.

### కళ్లను జాగ్రత్తగా కాపాడుకోండి



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

**ఉరవకొండ:** ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్వర్యంలో ప్రపంచ కంటి చూపు దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్‌కె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ప్రముఖ డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్ ఐ హస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అన్ని అవయవాల్లోకెల్లా కళ్లు ప్రధానమన్నారు. కళ్లను విద్యార్థి దశ నుంచే రక్షించుకోవాలన్నారు. బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షాషావలి, లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ గణేష్ బాబు, కార్యదర్శి వేదమూర్తి, ఎల్‌వీ ప్రసాద్ హస్పిటల్స్ వైద్యులు రఫీ, ఉష పాల్గొన్నారు.


### దుర్గంలో చిరుత సంచారం

**రాయదుర్గం:** పట్టణంలోని మెలకాల్మూరు చెక్ పోస్టు సమీపాన కొండల్లో చిరుత సంచరిస్తోంది. మంగళవారం కొండ ప్రాంతాల్లో చిరుత ఉన్న దృశ్యాల్ని కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ప్రజలు భయాందళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు మేల్కొని చిరుతను తరిమేయాలని కోరుతున్నారు.

### నకిలీ మద్యంతో ప్రజలను చంపుతారా?

**కుందుర్పి:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం బెల్టు దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న నకిలీ మద్యం సేవించి వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. తాము అధికారంలోని రాగానే నాణ్యమైన మద్యం అందిస్తామని చెప్పిన చంద్రబాబు.. ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. సమన్వయకర్త తలారి రంగయ్య సవాల్ మేరకు స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబు బెల్టు షాపుల్లో రుపాయి తీసుకోకపోతే ఎందుకు బెల్టు దుకాణాలను రద్దు చేయడం లేదో చెప్పాలని వైఎస్సార్‌సీపీ నాయకులు వాల్మీకి మాజీ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ నాగరాజు మండల కన్వీనర్ రాయుడు, మాజీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి తదితరులు డిమాండ్ చేశారు. బెల్టు దుకాణాలను రద్దు చేయకపోతే సమన్వయకర్త తలారి రంగయ్య నేతృత్వంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

### వైద్య కళాశాలలను ప్రైవేటీకరించొద్దు



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

**ఉరవకొండ:** ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఈనెల 18న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జై భీమ్‌రావ్ భారత్ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పోస్టర్లు విడుదల చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రామప్ప నాయక్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రవేట్ పరం చేయడానికి పీపీపీ విధానాన్ని అమలు చేయడం సరికాదన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జై భీమ్‌రావ్ భారత్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనుందన్నారు. ప్రభుత్వ కళాశాలలు ప్రవేట్ పరం అయితే రిజర్వేషన్లు, సామాజిక న్యాయం అమలుకు తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య విద్యను అమ్మకానికి పెట్టిందన్నారు. దీనిపై పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీహెచ్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మీనుగ గోపాల్, ముస్టూరు ఎర్రిస్వామి, తలారి తిప్పయ్య, ఓబన్న, రామాంజి పాల్గొన్నారు.